10-8-51

చెప్పేదేమిటంటే, "బాబూ, అట్లా కాదు. పక్రని పచ్చడితిన్నా నాలుకకు రుచే, తియ్యని హల్వా తిన్నా నాలుకకు రుచే, చిరుచేదు బుడమబద్దలు తిన్నా నాలుకకు రుచే. అచ్చమయిన ఆవు పాలు; అడవిలో మోకాలిలోతు సువాసనగడ్డి కొండమీద పగలల్లా మేసివచ్చిన నీరోగమయిన ఒకటి రెండీతల కుర్రిపాలు రుచి వేరయ్యా. ఆ పాలు గిన్నెడు త్రాగితే జిహ్వకూ శరీరానికి ఆధ్యాత్మిక ప్రవృత్తికి సర్వజానుపమయిన శక్తికి పుష్టినిస్తుంది! అల్లాగా అచ్చ వెన్నెల వంటి పరమ ధ్వనిమయమైన కవిత్వాన్ని ఆస్వాదించు, అది తర్పణం చేసినట్లుగా మరి యొకటి చేయ లేదు" అంటాం. ఆ పాలు త్రావి దాని రుచి తెలుసుకోటం చాలా కష్టం. ఇతర నీచరుచులు మరిగి నిజమయిన పాలరుచి యెట్లా తెలియదో అచ్చమైన కవిత్వమనే వెన్నెల రుచి కూడా అట్లాగే తెలియదు. అడవిని శాసించేవాడెవడు? ఈ యడవి యెన్నిరకాలుగా ఉంటేనేమికాని దురధికారపుటడవినిమాత్రం సహించడం కష్టం. పట్టి కట్టెలు తామూ అడవి అనుకొంటవి. నా మీద వెన్నెలను కాయమంటవి. ఆ వెన్నెల కాస్తూంటే తాము నిప్పు ముట్టించుకొంటవి. ఈ వెన్నెల చివళ్లు ఆ నిప్పు మంటలకు మాడి యిలకరచుకొపోతవి. అందుకనే అధిగత పరమార్థాన్ పండితాన్ మావమంస్థాః అన్నారు. పరమార్థమును తెలిసిన పండితుల నవమానించకు అని. ఇవన్నీ అడవికి చెప్పిన మాటలే. ఈ అడవినిగూర్చి మహాకవులు వేయితిట్లు తిట్టారు. ఆ అడవి అట్లాగే ఉంది. అది చేసే పనులు అప్పుడూ ఇప్పుడూ చేస్తూనే ఉంది. మరి యిదంతా యేమిటి, అడవి గాచిన వెన్నెల.

(ఆలిండియా రేడియో సౌజన్యంతో

స్కెచ్

# దేవుడి డబ్బాలు

ఆర్. ఎం. చిదంబరం

ఆఫీసునుండి అలసిపోయి రాగానే కాఫీ అయినా ఇవ్వకుండా నా అర్ధాంగి "ఏమండీ! ఈ వేళ కోటాబట్ట ఇస్తున్నారట బజారులో. ఏమైనా జాకెట్టు గుడ్డలు తెచ్చిపెట్టరూ!" అని ఆప్యాయంగా అడిగింది. అక్కడ కోటా బట్ట సంపాదించటమంటే పద్మవ్యూహాన్ని ఛేల్చుకుని పోవటమని ఆమెకు చెబుదామనుకున్నాను. కాని అలాగంటే నన్ను హేళన చేస్తుందని "కాఫీ త్రాగి వెడతాను" అన్నా. ఆమె త్వరగా కాఫీ తీసుకువచ్చి, "త్వరగా త్రాగి వెళ్ళండి" అని హెచ్చరించింది! నేనా గ్లాసెడు కాఫీని ఒక్క గుటకలో మింగేసి కోటా బట్ట యిచ్చే కొట్టుకు దౌడు తీశాను. అక్కడకు వెళ్లిన తరువాత "అయిపోయింద" న్నవార్త నా చెవిని పడకుండా ఉండాలని దైవానికి దండం పెట్టాను.

ఆ కొట్టుదగ్గర దృశ్యం భయంకరంగావుంది. ఓ వందమంది వరుసగా నిలబడున్నారు. అంటే కోటా బట్ట అందుకోవటానికి సైన్యమంతా, సరళరేఖా వ్యూహంలో నిలబడుతుందన్న మాట. మరో పాతికమంది క్యూలో నిలబడకుండా భుజబలాన్నుపయోగించి గుడ్డ సంపాదించాలని చూస్తుంటే పోలీసులు వారిని ఆటంకపరుస్తున్నారు. కాని తమ పరిచితులను యధేచ్ఛగా లోనికి పోనిచ్చి రానిస్తున్నారు.

"రోజూ రెండింటికి కొట్టు తీస్తాడు. ఈ వేళ నాలుగు గంటలకు తీశాడు" అన్న మాటలు నా చెవిని పడ్డాయి.

"అవునయ్యా! రెండింటికి తీస్తే ఏడింటి దాకా కోటా బట్ట అమ్మాలి. అందుకే నాలిగింటికి తీశాడు" అని పైమాటలన్న వ్యక్తి చెవిని పడేటట్టుగా అన్నాను.

ఇంతకీ బట్ట సంపాదించట మెలాగని ఆలోచించ సాగాను. నా దురదృష్టవశాత్తు కొట్టు వాడిని కాని, అక్కడి ఎజ్జిటోప్లిలను కాని ఎరుగను. అందుచేత ఆ క్యూలో నూటఒకటో వాడిగా చేరటం మంచిదనుకున్నాను.

"మూడింటికి వచ్చాను. అప్పుడెక్కడున్నానో ఇప్పుడూ అక్కడే ఉన్నాను. ఇక నాకు గుడ్డ దొరకదు గాబోలు."

"ఒకడు తరగ్గానే మొదట్లో మరొకడు చేరుతున్నాడు. ఇక వెనకవాళ్ళంతా ఇంతే."

ఈ సంభాషణ నా చెవిని పడేసరికి నా ఆలోచనకు ఉద్వాసన చెప్పాను. మూడింటికి వచ్చినవాడికే దిక్కులేకపోతే ఆరింటికి వచ్చి క్యూలో నూటఒకటో వాడిగా చేరదలచిన నాకు దిక్కెక్కడిది? వట్టిచేతులతో ఇంటికి పోలేక ఉపాయంకోసం ఆలోచిస్తున్నాను.

"బాబుగారూ! గుడ్డ కావాలండీ?"

ఎవడో చేతిలో జాకెట్టు గుడ్డతో నా దగ్గరకు వచ్చి ఈ ప్రశ్న వేశాడు.

"కావాలి... కావాలి... ఏదీ" అని గుడ్డను పరిశీలించి "ఎంతకొన్నావు? ఎంత ఇమ్మన్నావు?" అనడిగాను.

"రెండున్నరకు కొన్నానండి. దేవుడి డబ్బులతో నాలుగిప్పించండి" అన్నాడు.

"దేవుడి డబ్బు లేమిటయ్యా?" ఆశ్చర్యంగా అడిగాను.

"తెలియదండీ? ఆ కొట్టతను ప్రతివాడి దగ్గర దేవుడి డబ్బులని బేడ బేడ ఎక్కువ వసూలు చేస్తున్నాడండి."

"ఏమిటీ! బ్లాక్ మార్కెట్‌లో గుడ్డ కొంటున్నారా?" అనొక పెద్దమనిషి నా దగ్గరకు వచ్చాడు.

నేను తడబడుతూ "లేదండీ" అన్నాను.

"కొనకూడదండీ. నల్లబజారు నాశనమవాలని అంతా కోరుతూంటే మనం దానికి ప్రోత్సాహమివ్వకూడదు. మనవంటి చదువుకున్నవారమయినా ఈ నల్లబజారు నిర్మూలనకు నడుంకట్టాలి. తెలిసిందా?" అనొక చిన్న లెక్చరిచ్చాడు.

నాకా పెద్దమనిషి అన్నమాటలు నిజమనిపించాయి. "నాకక్కరలేదయ్యా" అనా గుడ్డను తిరిగి ఇచ్చేశాను, వాడు వెళ్ళిపోయాడు. కాని నాకు బోధచేసిన ఆ పెద్దమనిషి అతనిని వెంబడించాడు.

ఇంతలో బట్టలకోసం తాపత్రయపడుతున్న ఆడవాళ్ళలో కలవరం బయలుదేరింది.

"ఆడవాళ్ళకు బట్టలివ్వరట. ఇదేంఖర్మం. మాకు గుడ్డలక్కర్లేదా?" అనంటున్నదొకావిడ.

"మిమ్మల్ని కోటాలో కొన్న గుడ్డను ఎవడమ్మమన్నాడు? పోనీ ఆ పైకిపోయి అమ్మకోరాదూ! వీళ్ళకెదురుగానే అమ్మాలా?" అన్నాడొకడు.

"అయ్యో! ఆ పాడుముండ తెవరో అమ్మారు. అందుకు మేమేం చేస్తాం. మాకు కూడా ఇవ్వకూడదా" అన్నారువారు. మొత్తానికి ఆడవాళ్ళకుమాత్రం బట్టయిచ్చారు కాదు.

ఇంతలో నాదగ్గరకు బట్ట అమ్మటానికి వచ్చినవాడు నవ్వుతూవచ్చి "చూశారా! ఆయన మిమ్మల్ని బట్ట కొనొద్దన్నాడా? నన్ను దూరంగా తీసుకుపోయి మూడున్నరకు ఆబట్ట కొనేశాడు" అన్నాడు.

నేను నివ్వెరపోయాను. ఇంత ఉపన్యాసం ఇచ్చింది ఆ బట్టను తను కొనుక్కోవటానికా?

నా అదృష్టం కొలదీ మరొకడు నాదగ్గరకు జాకెట్టు గుడ్డ తీసుకొచ్చాడు. "ఈ మూడు గజాల గుడ్డకు ఎంతిమ్మంటావు?" అనడిగాను.

"దేవుడి డబ్బులతో మూడున్నరివ్వండి" అన్నాడు.

ఆలసిస్తే మరొక డెవడన్నా ఉపన్యాసం ఇచ్చి అది కొస్తా కాజేస్తాడేమోనని వాడు చెప్పిన ఖరీదిచ్చి కొనేశాను.

ఇంటికి వచ్చి మా ఆవిడకా గుడ్డనిస్తే "మూడు గజాలేనా దొరికింది! ఎంతకొన్నారు?" అనడిగింది.

"రెండున్నర రూపాయలు" అన్నాను, బ్లాక్ మార్కెట్‌లో కొన్నాననడానికి భయపడి. కొట్టుమీద కొంటే ఇంత కెక్కువే ఇవ్వవలసి వస్తుంది కదాయని నన్ను నేనే ఊరడించుకున్నాను.